
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ; 18 ; ఏప్రిల్ ; 2023



వీఓఏల సమ్మె ప్రారంభం

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ఐకేపీ వీఓఏలు సమ్మెకు దిగారు. 9లో



రామాలయంలో బదిలీలు

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయంలో ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేపట్టారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చు.



న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ముత్తంగి రూపంలో అలంకరించటం ప్రత్యేకత. సహస్ర కలశాభిషేకం సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాలు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

రామాలయంలో 'చందన ఘోష్టి'



దీక్షాపరులకు ప్రసాదం అందచేస్తున్న ఏఈఓ భవానీ రామకృష్ణ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి శ్రీరామ దీక్షాపరులకు చందన ఘోష్టిను ఘనంగా జరిపారు. బేడా మండపంలో దీక్షాపరులు శ్రీరామ భజనలు, కీర్తనలను ఆలపించారు. ఏఈఓ భవానీ రామకృష్ణ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

పర్ణశాల హుండీ ఆదాయం రూ.16.38 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. 8 నెలలకు రూ.16,38,680 ఆదాయం వచ్చినట్లు భద్రాచలం దేవస్థానం ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. ఏఈఓ శ్రావణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ కిశోర్ పాల్గొన్నారు.

షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలి

చుంచుపల్లి: గ్రామపంచాయతీల్లో అన్ని నర్సరీలకు షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్ సూచించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా ప్రాంగణాలు త్వరతగతిన పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించాలని చెప్పారు. వేసవిలో గ్రామ పంచాయతీల్లో మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

తీరని దాహార్తి



కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య

- వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే సరఫరా
- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టని అధికారుల
- జిల్లా కేంద్రంలో రూ.97 లక్షలు కేటాయించినా అదే పరిస్థితి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఈ ఏడాది కూడా తాగునీటి సమస్యలు తప్పడంలేదు. ప్రధానమైన కొత్తగూడెం, పాల్వంచ రెండు మున్సిపాలిటీల్లో దాహార్తి తీరక ప్రజలు అల్లాడుతున్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కొత్తగూడెం మున్సిపల్ అధికారులు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోవడం, పాలకవర్గం పట్టించుకోకపోవడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇక పాల్వంచ మున్సిపాలిటీకి పాలకవర్గం లేకపోవడంతో అధికారులను ప్రశ్నించేవారే లేరు. ఈ రెండు పురపాలికల్లో కొన్ని వార్డుల్లో వారానికోరోజు, మరికొన్ని వార్డుల్లో వారానికి రెండు రోజుల చొప్పున మాత్రమే కిన్నెరసాని పంపులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. నీటి సరఫరాల్లో అంతరాయం ఏర్పడితే మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిఉంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా, ట్యాంకర్లు రెండే ఉన్నాయి. అవి కూడా పట్టణంలో రోడ్ల వెంట ఉన్న మొక్కలకు నీరు పోసేందుకు ఉపయోగిస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో పట్టణంలోని కొన్ని వార్డులకే పైపులైన్ల ఏర్పాటు చేశారు. నీటి సరఫరా మాత్రం లేదు. మిగతా వార్డులకు ఇంకా పైపులైన్లు ఏర్పాటు చేయలేదు. కొన్ని వార్డుల్లో సింగరేణి పంపులు ఉండగా ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నాయి. మిగిలిన వార్డుల్లో బోర్లు ఉన్న ఇళ్లకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి పరిస్థితి నెలకొంది. తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీలో నీటి సరఫరా విభాగానికి ప్రత్యేకంగా ఏఈని కేటాయించాలని పలువురు కోరుతున్నారు. కాగా ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలలో సింగరేణి పంపులు, మున్సిపాలిటీ, మిషన్‌భగీరథ పంపులు వస్తుండటంతో నీటి సమస్య లేదు.



నిర్మాణం పూర్తైన వినియోగించని వాటర్ ట్యాంకు

ప్రతి నెలా కిన్నెరసాని పైపులైన్లకు రూ.5 లక్షలు

ప్రతి నెల కిన్నెరసాని పంపుల పైపులైన్ల మరమ్మతులకు రూ.5 లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారు. అయినా తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న ఫిల్టర్‌బెడ్‌లో తరుచుగా మోటర్లు కాలిపోవడంతో తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నారు. మరమ్మతులకు నాణ్యమైన సామగ్రి వినియోగించడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్ కోసం మున్సిపల్ అధికారులు నూతన మోటార్లను కొనుగోలు చేశారు. కానీ ఏర్పాటు చేయడంలేదు. పాత మోటార్లనే వినియోగిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక గొల్లగూడెం ఏరియాలో రూ.50 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును వినియోగంలోకి తీసుకురాలేదు.

రూ.97 లక్షలు ఏం చేశారు?

కొత్తగూడెంలోని 36 వార్డుల్లో వేసవిలో నీటి ఎద్దడి నివారణ, చేతి పంపుల మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు, కిన్నెరసాని మోటార్ల మరమ్మతులకురూ.97 లక్షలు కేటాయిస్తూ గత ఫిబ్రవరిలో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. ఆ నిధులతో ఏయే పనులు చేపట్టరానే విషయం అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. చేతి పంపులు, బోర్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. మరి నిధులన్నీ ఏం చేశారనే ప్రశ్న పట్టణవాసుల్లో వ్యక్తమవుతోంది.



పని చేయని చేతిపంపు

అంతరాయం లేకుండా చర్యలు



జిల్లా కేంద్రంలో నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం. మోటార్లు మరమ్మతులకు గురవడంతో సమస్య తలెత్తుతోంది. చేతిపంపులను సైతం రిపేర్లు చేయిస్తున్నాం. మిషన్ భగీరథ పంపుల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. కౌన్సిల్ ఆమోదం తెలిపిన నిధులతో మోటార్లు కొన్నాం.

– జి.రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

ప్రగతి నివేదికలు అందజేయాలి



ప్రజావాణిలో సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొత్తగూడెంఅర్బన్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శాఖల వారీగా ఈ నెల 22వ తేదీలోగా ప్రగతి నివేదికలు అందజేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై క్లుప్తంగా, తెలుగులో ప్రగతి నివేదికలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందచేయాలని అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- తనకు సర్వే నంబర్ 15/అ లో 23 కుంటలు, 15/ఆ/3లో 23 కుంటలు, 16/అ/4 లో 21 కుంటల భూమి ఉన్నదని, భూమి శిస్తు కూడా చెల్లిస్తున్నానని, తనకు పట్టా ఇప్పించాలని సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామానికి చెందిన తమ్మ రాజమ్మ వినతిపత్రం ఇవ్వగా.. పరిశీలించిన అదనపు కలెక్టర్ కలెక్టరేట్ ఈ–సెక్షన్ పర్యవేక్షకులకు ఎండార్స్ చేశారు.
- అంకమ్మతల్లి దేవాలయం దగ్గర ఉన్న సీపీఎస్ పాఠశాల భవనం మరమ్మతు పనులు, సీసీ రోడ్ల పనులు నాసిరకంగా చేపట్టారని, అధికారుల పర్యవేక్షణ లేదని అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. వివరాలు కావాలని సమాచారహక్కు చట్టం ద్వారా అడిగితే ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్తున్నారని, విచారణ నిర్వహించి నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరగా.. దరఖాస్తును పంచాయితీరాజ్ ఈఈకి ఎండార్స్ చేశారు.
- బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయామని మణుగూరు మండలం విజయనగరం (తిర్లాపురం) గ్రామానికి చెందిన మునిగల శివాజీ అర్జీ ఇచ్చారు. విచారణ సమయంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖమ్మం మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని, రైల్వేలైన్ నిర్మాణంలో నిరాశ్రయులైన వారికి మంజూరు చేసిన విధంగా తనకు కూడా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరగా.. తగిన చర్యలకు చేపట్టాలని భూ సేకరణ పర్యవేక్షకులకు ఎండార్స్ చేశారు.
- సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసుకునేందుకు 4,5 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించాలని పాల్వంచ మండలం గాంధీనగర్, మంచికంటినగర్‌లకు చెందిన ధరావత్ శివకృష్ణ, గడిదేశి రాజు, గాడిపల్లి కల్యాణ్‌కుమార్ కోరారు. తాము దినసరి కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నామని, తమకు ప్రభుత్వం లీజుకు భూమిని కేటాయించాలని కోరగా.. అర్జీని కలెక్టరేట్‌లోని ఈ సెక్షన్ పర్యవేక్షకులకు ఎండార్స్ చేశారు.
- రెండు పడక గదుల ఇళ్లు కేటాయించాలని కొత్తగూడెం మండలం కూలీలైన్ చెందిన కె.సతీష్‌కుమార్ వినతిపత్రం ఇవ్వగా.. పరిశీలించిన అదనపు కలెక్టర్ తగిన చర్యల నిమిత్తం డీఆర్వోకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



ముస్లింలతో కలిసి దువా చేస్తున్న శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: ముస్లిం యువతకు విద్య, వైద్యం, ఉపాధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని జీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ గడల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కొత్తగూడెంలోని కేసీఓఏ క్లబ్‌లో జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. తొలుత ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం కేసీ ఆర్ ముస్లింల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పరీక్ష నిర్వహణపై ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం విద్యా, రెవెన్యూ, పోలీసు, వైద్య, రవాణా, విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీ, మున్సిపల్, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1,912 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. 9 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 96 మంది ఇన్విజిలేటర్లు, 2 సిట్టింగ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నట్లు వివరించారు. అత్యవసర చికిత్సా కేంద్రాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, పరీక్ష కేంద్రాల వద్ద వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. డీఆర్‌డీఓ అశోక్‌చక్రవర్తి, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆర్డీఓ వేణు, విద్యుత్ శాఖ డీఈ వెంకటరత్నం, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ గనులు ప్రారంభించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

ఇల్లెందు/గుండాల: గుండాల, కాచనపల్లి ప్రాంతాల్లో బొగ్గు గనులు ప్రారంభించి ఏజెన్సీ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై చేపట్టిన ప్రజాపోరు యాత్ర సోమవారం గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు మండలాల్లో సాగింది. పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిత్యావసర ధరలను నియంత్రించాలని, కౌలు రైతులకు రైతుబంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు సీసీఐ కేంద్రాలు, కొమరారం, బోడు, సుదిమళ్ల మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యసౌకర్యాలు మెరుగుపర్చాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న జేకే ఓసీ కింద 3,200 మంది నిర్వాసితుల వుతున్నారని, వారికీ పరిహారం చెల్లించాలని, పునరావాసం కల్పించాలని కోరారు. రోళ్లపాడు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీని అడ్డుకునేందుకు కలిసి వచ్చే భావసారుప్యశక్తులతో కలిసి పని చేస్తామని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలిచినందుకే తాము బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు బొల్లోజు అయోధ్య, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, బందెల నర్సయ్య, బంధం నాగయ్య, గుత్తుల సత్యనారాయణ, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, బ్రహ్మం, రత్నకుమారి, రేసు ఎల్లయ్య, వాగబోయిన రమేష్, కృష్ణయ్య, కోటేశ్వరావు, షాహెద్, శ్రీను, రాజయ్య, రహీం, రాంబాబు, ఉడుత ఐలయ్య, గుగులోతు కృష్ణ, గణపతి, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, కనకతార, శ్రీలక్ష్మి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

- వారం రోజుల్లో 29 మందికి పాజిటివ్
- నిబంధనలు పాటించాలని వైద్యశాఖ సూచనలు



హోం ఐసోలేషన్‌లో ఉన్న వారికి సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

చుంచుపల్లి: జిల్లాలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. గడిచిన వారం రోజుల్లో 29 మందికి పాజిటివ్ నిర్ధారణ కాగా, శనివారం ఒక్క రోజే 10 కేసులు నమోదవడం ఒకింత ఆందోళన కలిగిస్తోంది. వైద్యశాఖ ముందస్తుగా హెచ్చరించినట్లుగానే ఫోర్త్‌వేవ్ ముప్పు ముంచుకొస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో కోవిడ్ యాక్టివ్ కేసులు 30 లోపు ఉన్నా, వాస్తవానికి అవి రెండింతలు పైగానే ఉంటాయని తెలుస్తోంది. ఈ నెల ఆరంభం నుంచి జిల్లాలో కరోనా ఫోర్త్ వేవ్ ప్రభావం కనిపిస్తోంది. దీంతో అప్రమత్తమైన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన ఆస్పత్రులు కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేటలతో పాటు పీహెచ్‌సీల పరిధిలో కోవిడ్ వార్డులు, పడకలు సిద్ధం చేశారు. ఆక్సిజన్లు, ఐసీయూ (వెంటిలేటర్లు సహా) ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో అత్యధికంగా ట్రావెలింగ్ హిస్టరీ కలిగినవేని వైద్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. బయటకు వెళ్తే మాస్కులు ధరించాలని, మార్కెట్లు, షాపింగ్ మాల్స్, బ్యాంకులు తదితర జన సంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో భౌతిక దూరం పాటించాలని, చేతులు శానిటైజేషన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉంటే మేలు..


జిల్లాలో 360 వరకు పరిశ్రమలు ఉండగా, పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ , గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఇక్కడ కార్మికులుగా పనిచేస్తుండటం, హైదరాబాద్‌తో పాటు ఏపీలోని పలు ప్రాంతాలతో జిల్లాకు వాణిజ్య తదితర సంబంధాలు ఉండటంతో నిత్యం రాకపోకలు సాగుతాయి. ఈ నేపథ్యంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోనూ కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అక్కడికి వెళ్లి వచ్చే వారికీ ముప్పు పొంచి ఉంది. జిల్లాలో నమోదైన 29 పాజిటివ్ కేసుల్లో సగం మందికిపైగా ఇటీవల ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారే కావడం గమనార్హం. ఈ క్రమంలో జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నెల 10,11 తేదీల్లో జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల తోపాటు అన్ని పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు కరోనా నియంత్రణపై రెండు రోజులపాటు మాక్ డ్రిల్ నిర్వహించారు. వసతులు, బెడ్‌లు సిద్ధం చేసి ఉంచారు. కాగా వైద్య సిబ్బంది కోవిడ్ లక్షణాలు కలిగిన వ్యక్తులను వారం రోజులు హోం ఐసోలేషన్‌లో ఉంచేలా చర్యలు చేడుతున్నారు.

- ఈ నెల 15న దుమ్ముగూడెం మండలం సింగవరం గ్రామపంచాయతీ పరిధిలోని వైట్ నగరం గ్రామంలో ఐదు, ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు.. ఒక్కరోజే 10 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.
- ఈ నెల 14న ఆళ్లపల్లి మండలంలోని ఆళ్లపల్లి, కాచనపల్లి, రామానుజగూడెం, తీగలంచ, రాఘవపురం, సుద్దరేవు, తునికి బంధాల గ్రామాల్లో 7 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.
- ఈ నెల 12న అశ్వారావుపేట మండలంలోని తిమ్మాపురం, వినాయకపురం, కుదుములపాడు, మొద్దులమాడ గ్రామాల్లో నలుగురు కరోనా బారిన పడగా, ఈ నెల 8న పాల్వంచ పట్టణ పరిధిలో ఒక కానిస్టేబుల్‌తో పాటు మరో వ్యక్తికి పాజిటివ్‌గా తేలింది.

ఆస్పత్రుల్లో కోవిడ్ వైద్య పరికరాలు, వసతుల వివరాలు

అందుబాటులో ఉన్న ఆస్పత్రులు,	
ఆరోగ్య కేంద్రాలు	: 215
మొత్తం పడకలు	: 1,235
ఐసోలేషన్ బెడ్స్	: 236
ఆక్సిజన్ సపోర్ట్ బెడ్స్	: 352
ఐసీయూ బెడ్స్	: 73
వెంటిలేటర్ బెడ్స్	: 32
అల్లోపతి వైద్యులు	: 189
ఆయుష్ వైద్యులు	: 62
నర్సులు	: 520
పారా మెడికల్ సిబ్బంది	: 659
అంబులెన్స్‌లు	: 30
పీఎస్‌ఏ ప్లాంట్లు	: 04
లిక్విడ్ ఆక్సిజన్ స్టోరేజ్ ట్యాంకులు	: 02


స్వీయరక్షణ పాటించాలి



జిల్లాలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 29 పాజిటివ్ కేసులు వచ్చాయి. ఇటీవల కరోనా నిర్ధారణ అయిన వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యసేవలందిస్తున్నాం. అన్ని ఆస్పత్రుల్లో టెస్టింగ్ కిట్లు, వార్డులు, ఐసీయూ, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, ఐసోలేషన్ బెడ్స్ సిద్ధంగా ఉంచాం. ప్రజలంతా స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ జేవీఎల్ శిరీష, డీఎంహెచ్ఓ

భయపడాల్సిన అవసరం లేదు



ప్రస్తుతం జిల్లాలో కరోనా కేసులు కొంతమేర పెరుగుతున్నా ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఫోర్త్ వేవ్ కరోనా తీవ్రత అంత ప్రమాదకరమైనది కాదు. సాధారణ జలుబు, జ్వరం, వాసన తెలియకపోవడం వంటి లక్షణాలే ఉంటాయి. వారం రోజులు మందులు వాడుతూ హోం ఐసోలేషన్ పాటిస్తే తగ్గిపోతుంది.

– డాక్టర్ రవిబాబు, డీసీహెచ్ఎస్

ఇల్లెందులో 16 కేసులు



కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో వారం రోజులుగా 16 కరోనా కేసులు నమోదయ్యాయి. సోమవారం ఒక్కరోజే ఆరుగురికి పాజిటివ్‌గా తేలింది. కరెంటాఫీస్, బాలాజీనగర్, ఇందిరానగర్, అన్నారం, పూబెల్లి, రైటర్ బస్తీ, నంబర్–2 బస్తీ, 15 నెంబర్ బస్తీ, సుందరయ్య నగర్‌లలో కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉంటే కరోనా పరీక్ష చేయించుకోవాలని, పాజిటివ్ వచ్చిన వారు క్వారంటైన్‌లో ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నారు.

గ్రామీణ బ్యాంకుల్లో ఏపీజీవీబీ అగ్రస్థానం



మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: దేశంలోనే గ్రామీణ బ్యాంకుల పరంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ (ఏపీజీవీబీ) అగ్రగామిగా ఉందని బ్యాంక్ చైర్మన్ కొండూరు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఎస్‌టీ రోడ్డులో నిర్మించిన బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ భవనాన్ని సోమవారం చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మొత్తం 43 గ్రామీణ బ్యాంకులు ఉండగా.. ఇందులో ఏపీజీవీబీ రూ. 52 వేల కోట్ల టర్నోవర్‌తో అగ్రభాగాన నిలుస్తోందని చెప్పారు. గడిచిన మూడేళ్ల నుంచి లాభాల్లో ముందంజలో ఉందని వివరించారు. 2020–21లో రూ.1,011 కోట్లు 2021–22లో రూ.813 కోట్లు, 2022–23లో రూ. 1,046 కోట్ల లాభాలను ఆర్జించినట్లు తెలిపారు. ఇక రూ.11 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలు ఇవ్వగా.. గృహరుణాలు రూ.4వేల కోట్లు, బంగారంపై రుణాలు రూ.3,400 కోట్ల రుణాలు ఇచ్చామని చైర్మన్ వివరించారు. గ్రామాల్లో మొబైల్ ఏటీఎంలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఏపీజీవీబీకి తెలంగాణలో తొమ్మిది, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయని, ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం రూ.2,300 కోట్ల టర్నోవర్‌తో ఉండగా, 64 బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయని చైర్మన్ వివరించారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్లు డి.దయాకర్, వి.అనిల్, ఖమ్మం రీజినల్ మేనేజర్ బి.విజయ్ భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దిశ కమిటీ ఆధ్వర్యంలో ప్రేమ వివాహం



ప్రేమ వివాహం చేస్తున్న వీరభద్రం, దిశ కమిటీ సభ్యులు

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలువబజార్‌కు చెందిన కంచుగట్ల గోపి, మణుగూరుకు చెందిన తోట జాన్వి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు వీరి ప్రేమకు ఒప్పుకోకపోవడంతో మైనారిటీ తీరిన ఇద్దరు సోమవారం వైస్ ఎంపీపీ వీరభద్రం, దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణను సంప్రదించగా పెద్దల సమక్షంలో మండల కేంద్రంలో వివాహం చేశారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో కేసు నమోదు

ఇల్లెందు: చిట్టీ డబ్బులు అడిగితే ఇవ్వకుండా ఇక్కట్లు సృష్టిస్తూ తమ పట్ల దురుసుగా మాట్లాడుతూ దుర్భాషలాడుతున్నారని ఓ బాధితుడు కోర్టును వేడుకున్నారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన ఘటన ఇది. ఇందిరానగర్‌కు చెందిన మేకల రవిబాబు ఇల్లెందుకు చెందిన డి.శంకర్, శ్రీనులు చిట్టి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. చిట్టీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఈ విషయమై అడిగేందుకు వెళ్లిన క్రమంలో శంకర్ కుమారుడు శ్రీను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో శ్రీను మీద కేసు నమోదు చేసినట్లు సీఐ బి.రాజు సోమవారం తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని కాటాయిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తోలకాలు చేస్తున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను తహసీల్దార్ ప్రతాప్ స్వాధీనం చేసుకుని కార్యాలయనాకి తరలించారు. కాటాయిగూడెం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తోలకాలు చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా గ్రామ పంచాయతీలో నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట సోమవారం అగ్నికి ఆహుతైంది. తండాకు చెందిన మూడు బాలాజీ, భూక్య లాల్యా తమకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవలే చేనులో కంకులను విరిచి అక్కడే మరపట్టి ఆరబెట్టేందుకు పొలం వద్దే కంకులను కుప్పగా పోశారు. సమీపంలో నిప్పురవ్వలు ఎగిసిపడటంతో ఎండిపోయిన మొక్కజొన్న కండెలతోపాటు కుప్పగా పోసిన మొక్కజొన్న కూడా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రైతులు ఇచ్చిన సమాచారం మేరకు ఇల్లెందు అగ్నిమాపక వాహనం వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది.

బూడిద లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ బూడిద చెరువు నుంచి బూడిదను తరలిస్తున్న లారీలను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కేటీపీఎస్ బూడిద చెరువు నుంచి పాత సూరారం మీదుగా నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగించడంతో బూడిద, కాలుష్యంతోపాటు రాకపోకలకు ప్రమాదకరంగా మారిందని స్థానికులు, పాండురంగాపురంవాసులు లారీలను అడ్డుకున్నారు. దీంతో బూడిదలారీలు రహదారి పొడవునా నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు బూడిద లారీలు, భారీ కంటెయినర్లు రాకపోకలు సాగించడం వల్ల రహదారి ప్రమాదకరంగా మారిందని, అధికారులు స్పందించి బూడిద లారీలను ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్టల రామరామారావు, అనురాధ, భద్రు తదితరలు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,943

సర్వం శుభం.. పుణ్య ఫలం..

నేడు షబ్-ఏ-ఖదర్
- రంజాన్ మాసంలో మహోన్నతమైన రోజు
- దివ్య ఖురాన్ ఈ రాత్రే ఆవిష్కృతమైనట్లు ప్రతీతి



కరకగూడెం: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు మహోన్నతమైన రోజుగా భావించే షబ్-ఏ-ఖదర్ పర్వదినాన్ని మంగళవారం జరుపుకోనున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం గత నెల 24వ తేదీ నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ మాసం చివరి పది రోజుల్లో ఐదు రోజులు జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనలకు ఉపక్రమిస్తారు. షబ్-ఏ-ఖదర్ రాత్రి దివ్య ఖురాన్ దివి నుంచి భువికి ఆవిష్కృతమైనట్లు ప్రతీతి. అందుకే ఈ రాత్రిని మహోన్నతమైన రాత్రిగా భావిస్తారు, ఈ రాత్రి జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటే తెలిసి తెలియక చేసిన పాపాలు దహించివేయడంతో పాటు పుణ్య ఫలాలు లభిస్తాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ ఒక్క రాత్రి జాగారం చేసి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అల్లాహ్‌ని వేడుకుంటే వెయ్యి మాసాల ప్రార్థనలకన్నా ఎక్కువ పుణ్య ఫలం లభిస్తుందని ముస్లింలు విశ్వసిస్తుంటారు. షబ్-ఏ-ఖదర్ నాడు దివ్య ఖురాన్ గ్రంథం ఆవిష్కృతం కావడంతో పాటు ఆ రోజు నుంచే ఇస్లాం ధర్మ సూత్రాలు అమల్లోకి వచ్చాయని, ఐదు పూటలా నమాజ్ ప్రక్రియ ప్రారంభమైందని పెద్దలు పేర్కొంటున్నారు.

దైవం చూపిన మార్గం..



పవిత్ర రంజాన్ మాసంలో ఖురాన్ గ్రంథాన్ని అల్లాహ్ దివి నుంచి భువికి పంపారు. మహ్మద్ ప్రవక్త సలల్లాహుహవసల్లం ద్వారా షబ్-ఏ-ఖదర్ రాత్రి ఖురాన్ వెలువడింది. దైవం చూపిన మార్గం దివ్య ఖురాన్ చూపించే మార్గం సరళమైంది. – మౌలానా మహ్మద్ ఫిరోజ్, కరకగూడెం జమా మసీద్

వెయ్యి నెలల పుణ్య ఫలం



షబ్-ఏ-ఖదర్ రోజున జాగారం చేస్తే వెయ్యి నెలల పాటు ఆచరించిన పుణ్యఫలం దక్కుతుందని మా నమ్మకం. యువత, పెద్దలు ఖురాన్ పఠించి ఉపవాసాల అలసటను మరిచి అల్లాహ్‌ను ధ్యానిస్తాం. ఇదీ మాకు ఎంతో ప్రత్యేకమైంది. మౌలానా ఖ్వారీ మహ్మద్ అజామ్, పద్మాపురం మజీద్

విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన సాయం సుజలసాయిశ్రీ రాష్ట్రస్థాయి యంగ్ జీనియస్ పోటీల్లో 3వ ర్యాంకు సాధించి సినీ హీరో అడివిశేష చేతుల మీదుగా అవార్డు అందుకుంది. సాయిశ్రీ కొత్తగూడెంలోని త్రివేణి పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కాగా, సుచిరిండియా సీవీ రామన్‌యంగ్ జీనియస్ టాలెంటెడ్ ఆన్‌లైన్ పరీక్షల్లో సాయిశ్రీ మంచి ప్రతిభ కనబరిచింది. దీంతో నిర్వాహకులు హైదరబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ హీరో అడివి శేషు చేతులమీదుగా అవార్డును అందించారు.

ఇల్లెందు సీఐగా టి.కరుణాకర్



టి.కరుణాకర్

ఇల్లెందు: ఇల్లెందు సీఐగా టి.కరుణాకర్‌ను నియమిస్తూ ఇక్కడి సీఐ బి.రాజును బదిలీ చేస్తూ వరంగల్ రేంజ్ ఐజీ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 2009 బ్యాచ్ ఎస్ఐగా పోలీసు శాఖలో ఉద్యోగం సాధించిన కరుణాకర్.. పలు జిల్లాల్లో ఎస్ఐగా పనిచేశారు. సీఐగా మధిర, గుండాలలో పనిచేశారు. కాగా, ఇల్లెందులో పనిచేస్తున్న బి.రాజును హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. గతేడాది మార్చి 9న ఇల్లెందు సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజు కొంతకాలంగా బదిలీపై వెళ్లాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సీఐ రాజు స్థానంలో గుండాల సీఐ కరుణాకర్‌ను ఇల్లెందుకు బదిలీ చేశారు. గుండాలలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకుండా కరుణాకర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దమ్మపేట: మండలంలోని జగ్గారం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని జగ్గారం గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై ఎస్ఐ శ్రావణ్‌కుమార్ దాడి చేశారు. దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.9 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఫోన్ ఆర్డర్ చేస్తే సబ్బు డెలివరీ!

కారేపల్లి: ఊరూపేరు లేని సైట్లలో సరుకులు ఆర్డర్ చేస్తే మోసం జరుగుతుందనేందుకు ఇది మరో ఉదాహరణ. కారేపల్లి మండలం పేరుపల్లికి చెందిన పేరుపల్లికి చెందిన కమిడి జగన్ ఓ యాప్ ద్వారా ఈనెల12న నోకియా 2660 ఫోన్ కోసం ఆర్డర్ చేశాడు. సోమవారం డెలివరీ బాయ్ పార్సిల్ తీసుకు రావడంతో రూ.1,066 చెల్లించిన జగన్ దానిని డెలివరీ బాయ్ ముందే తెరవగా రూ.10 విలువైన సబ్బు కనిపించింది. దీంతో ఖంగుతిన్న జగన్ డెలివరీ బాయ్‌ను నిలదీయడంతో డబ్బులు తిరిగి ఇచ్చేశాడు.

చెట్టును ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

అక్కడికక్కడే డ్రైవర్ మృతి, ఇంకొకరికి తీవ్రగాయాలు



ఘటనాస్థలంలో పరిశీలిస్తున్న ఏసీపీ రామానుజం, సీఐ కరుణాకర్

సత్తుపల్లిటౌన్: నిద్ర మత్తు.. ఆపై మలుపు.. ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి డీసీఎం వ్యాన్ చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సత్తుపల్లి శివారులో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమెల మండలం చెప్యాలకు చెందిన ఈడపల్లి నరేష్(32) తన స్నేహితుడు చిర్రా నరేష్‌తో కలిసి అనకాపల్లి వెళ్లాడు. అక్కడి నుంచి కరీంనగర్‌కు సెంట్రింగ్ కర్ర లోడ్‌తో డీసీఎంలో ఆదివారం రాత్రి బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయాన సత్తుపల్లి మండలం తాళ్లమడ పెద్దవంతెన సమీపాన డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు తెలుస్తుండగా, మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో డ్రైవర్ ఈడపల్లి నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సౌజన్య ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

నేనెలా బతికానో..

మంచి నిద్రలో ఉన్న తాను ఒక్కసారిగా ఎగిరి బయటపడ్డానని వ్యాన్ డ్రైవర్ స్నేహితుడు చిర్రా నరేష్ తెలిపారు. ఇంతలోనే స్థానికులు వచ్చి అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈప్రమాదాన్ని తలుచుకుంటేనే భయంగా ఉందని పేర్కొన్నాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ ఈడపల్లి నరేష్ ఇంటిపక్కనే ఉండే తాను నరేష్‌కు తోడుగా వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వాపోయాడు. కాగా, ఘటనపై సత్తుపల్లి ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు లారీలు ఢీ, డ్రైవర్ మృతి



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

సత్తుపల్లిటౌన్: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందగా.. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లిలో సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోవిందాపూర్‌కు చెందిన జైనుల్ అబేదిన్(53) కోల్‌కత్తాలోని సొత్ కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఐరన్ పైపుల లోడ్‌తో లారీలో హైదరాబాద్ బయలుదేరాడు. లారీ సత్తుపల్లి హిందూ వైకుంఠధామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా వేగంగా ఢీకొనటంతో క్యాబిన్లు నుజ్జునుజ్జయ్యాయి. ఇందులో కోల్‌కత్తా నుంచి వస్తున్న డ్రైవర్ జైనుల్ అబేదిన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు శ్రమించి బయటకు తీయగా అప్పటికికే మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్ కృష్ణా జిల్లా గంర్రాయికి చెందిన కొత్తపల్లి వెంకయ్య తలకు బలయమైన గాయాలు కావటంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొనడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకొని రాకపోకలను క్రమబద్ధీకరించారు.


ఆకస్మాత్తుగా బాలుడు..



గౌరబోయిన జై (ఫైల్)

తిరుమలాయపాలెం: తల్లిదండ్రులతో కలిపి పొలం వద్ద ఉప్పలమ్మ తల్లి పూజకు వెళ్లి వచ్చిన మూడేళ్ల బాలుడు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయి కన్నుమూశాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని కాకరవాయికి చెందిన గౌరబోయిన శంకర్, కవితకు కుమార్తె లక్కీ, కుమారులు వర్షిత్, జై(3) ఉన్నారు. చిన్నకుమారుడైన జైకి రెండు రోజులుగా జ్వరం వస్తున్నా తగ్గుతుందని భావించారు. ఈక్రమంలో తల్లిదండ్రులు ఆయనను తీసుకుని వ్యవసాయ క్షేత్రం వద్ద ఉప్పలమ్మ తల్లికి పాలు పొంగించేందుకు సోమవారం ఉదయం వెళ్లి మధ్యాహ్నం వచ్చారు. అంతసేపు ఆటపాటలతో సందడి చేసిన జై ఒక్కసారిగా పడిపోగా ముక్కులో నుంచి రక్తం వచ్చింది. దీంతో ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోగానే ప్రాణాలు కోల్పోయాడు. పెద్ద కుమారుడు వర్షిత్ ఇటీవల గుండెజబ్బు బారిన పడడంతో చికిత్స చేయించగా.. చిన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే, జై కూడా గుండె సంబంధిత ఇబ్బందితోనే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...



రాజాబాబు (ఫైల్)

బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన వేము రాజాబాబు(50) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. రాజాబాబు చేపలు అమ్మేందుకు కలకోట నుండి మధిర వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వైరా నుండి మధిర వైపు వెళ్తున్న లారీ వెనక నుండి ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

‘సీతమ్మ సాగర్’ పనులను నిలిపివేయాలి..

నిర్వాసితుల గ్రామసభలో భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

చర్ల: సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ పూర్తి డిజైన్‌ను బహిర్గతం చేయాలని, ముపునకు గురవుతున్న బాధిత రైతులకు ఎకరాకు రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని, గ్రామాలకు నష్టం వాటిల్లకుండా వరద కరకట్టల నిర్మాణ పనులను చేపట్టాలని, నిబంధనలను అతిక్రమించి కొనసాగుతున్న పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఇటీవల కుదునూరు, తేగడ గ్రామాలలో రెండో విడత భూసేకరణ సర్వే పనులను అడ్డుకొని ఆందోళన చేసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సోమవారం కుదునూరులో గ్రామసభ ఏర్పాటు చేశారు. హాజరైన ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారని కోర్టులో కేసు వేశారని, విచారించిన కోర్టు సీతమ్మసాగర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ పనులు కొనసాగిస్తోందని మండిపడ్డారు. దీనిపై మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం, చర్ల.. పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వేలాది ఎకరాల సారవంతమైన భూములు ముంపునకు గురవుతుండగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలోని ఒక్క ఎకరాకు కూడా ఉపయోగం లేదన్నారు. అనంతరం ఆయన పనులను పరిశీలించారు. కార్యాక్రమంలో తహసీల్దార్ బి.భరణిబాబు, కుదునూరు, పులిగుండాల సర్పంచ్‌లు కుంజా కమల, సోడి చలపతి, ఎంపీటీసీ సభ్యులు కుంజా నాగేశ్వరరావు, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, ఆవుల విజయభాస్కర్‌రెడ్డి పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎంపీపీ సహా పలువురి రాజీనామా



రాజీనామా అనంతరం నినాదాలు చేస్తున్న నాయకులు

చండ్రుగొండ: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్‌కు పలువురు నాయకులు రాజీనామా చేశారు. పొంగులేటి వర్గీయుడు జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ బాణోత్ పార్వతి, వైఎస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణతో సహా గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, జిల్లా రైతుబంధు మాజీ సమన్వయకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు మాళోత్ భోజ్యా నాయక్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై పొంగులేటితోనే తమ రాజకీయ ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో సారేపల్లి శేఖర్, బాణోత్ రాముడు, కిరణ్‌రెడ్డి, శెట్టిపల్లి కృష్ణయ్య, ఎస్.అప్పారావు, కిషన్, తిరుపతి, రాందాస్ తదితరులు ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జినుగు మరియన్న

కొత్తగూడెంఅర్బన్: వేసవి కాలంలో ఉద్యాన, మల్బరీ, కూరగాయలు, ఆయిల్‌పామ్ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న తెలిపారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలోని 1,55,940 ఎకరాలలో ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ పంటలు సాగులో ఉన్నాయని, వాటిలో ప్రధానంగా ఆయిల్‌పామ్, మిరప, జీడిమామిడి, కూరగాయలు, ఆకుకూరలు, అరటి, జామ, మామిడి, బొప్పాయి, నిమ్మ, పూలు, మల్బరీ సాగు చేస్తున్నారని, మిద్దెతోటల సాగు, పెరటితోటల సాగు కూడా విరివిగా సాగుతున్నాయని తెలిపారు. తోటల్లో మొక్కలకు సమృద్ధిగా నీరు పెట్టాలని, బిందు సేద్య పద్ధతులు మేలని, ఈ పద్ధతిలో నీరుతో పాటు ఎరువులు అందించాలన్నారు. చీడపీడలపై అవగాహన ఉండాలని చెప్పారు. మొక్కల మీద మట్టి మిశ్రమాన్ని, సున్నపు నీరును పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వేసవిలో బెండ, గుమ్మడి, పుచ్చ, సొర, కాకర, నాటుదోస, బుడం దోస, దొండ, వంగ, గోరు చిక్కుడు, పొట్ల, ఆకుకూరలు, పుదీనా తదితర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. విస్తరణ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

అరుణను చంపింది అల్లుడేనని ఫిర్యాదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఆదివారం ఓ లాడ్జిలో అనుమానాస్పదంగా మృతి చెందిన రావూరి అరుణ (35)ను ఆమెకు అల్లుడు వరసయ్యే ఆంజనేయులు హత్య చేసినట్లు సోమవారం అరుణ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అరుణ హైదరాబాద్‌లో ఆమె భర్త కృష్ణారావుతో కలిసి కోళ్ల ఫారంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 14వ తేదీన అరుణ.. తనకు కడుపులో నొప్పి వస్తోందని, ఆమె సొంత గ్రామం అయిన తిరువూరులో వైద్యులకు చూపించుకుని వస్తానని చెప్పి హైదరాబాద్ నుంచి బయలుదేరింది. ఖమ్మం జిల్లాలోని కప్పలబంధం గ్రామానికి చెందిన ఆంజనేయులు (అరుణ భర్త కృష్ణార్జున్‌రావు మేనల్లుడు)తో కలిసి భద్రాచలం పట్టణానికి చేరుకొని లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. ఒక రోజు అదే గదిలో ఇద్దరూ కలిసి ఉన్నారని, ఇది తెలిస్తే పరువుపోతుందని గ్రహించిన అరుణ గదిలో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు లాడ్జి నిర్వాహకులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. ఇదే విషయాన్ని అరుణ కుటుంబ సభ్యులకు తెలిపామని పోలీసులు చెప్పారు. సోమవారం అరుణ మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు పరిశీలించి ఆమె మెడ చుట్టూ కమిలి ఉన్న గాయాన్ని బట్టి ఆంజనేయులే చీరను అరుణ గొంతుకు చుట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి ఉంటాడని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఇందుకు సంబంధించి పోలీసులు సెక్షన్ 302 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

మహిళపై దౌర్జన్యం కేసులో రెండేళ్ల జైలు

టేకులపల్లి: మహిళ ఇంటికి వెళ్లి ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించి, దౌర్జన్యానికి దిగిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముకేశ్ తీర్పు చెప్పారు. 2017లో మండలంలోని రేగులతండాకు చెందిన అజ్మీర నరేశ్ ఒక మహిళ ఇంటికి వెళ్లి అనుచితంగా ప్రవర్తించి, దౌర్జన్యం చేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ తాటిపాముల సురేశ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఇల్లెందు కోర్టులో వాదోపవాదాలు విన్న తరువాత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.ముకేశ్ ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల మరో ఆరు నెలలు శిక్షను ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వి.రచిత వాదించగా హోంగార్డు బి.రమేశ్, ఐటీ టి.సురేశ్, సీడీఓ బి.నరేశ్, ఎస్‌హెచ్ఓ జి.రమణారెడ్డి సహకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ



పగులగొట్టి పక్కకు పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

కరకగూడెం: ట్రాన్స్‌ఫార్మర్‌ని పగులగొట్టి అందులో ఉండే కాపర్ (రాగి తీగ)ను అపహరించిన ఘటన మండలంలోని అనంతారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జీవన్‌రాజ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మొగిలి వెంకన్న పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులోని రాగితీగను ఎత్తుకెళ్లారు. కాగా, రోజువారీగా వెంకన్న సోమవారం ఉదయం పొలం వద్దకు రాగా పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గమనించి స్థానిక విద్యుత్ శాఖ ఏఈ నరేందర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సైతం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: అనారోగ్యం కారణంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం చౌడవరం గ్రామానికి చెందిన ఆళ్ల రాములు (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భద్రాచలంలో నివాసం ఉంటున్న చిన్నకుమార్తె దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి సోమవారం ఇంటి నుంచి బయలుదేరాడు. మండలంలోని కట్టుగూడెం గ్రామం వద్ద పురుగుల మందు తాగి, కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వారు అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో చనిపోయాడని వారు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

ములకలపల్లి: బాలికకు మాయమాటలు చెప్పి లైంగికంగా లోబర్చుకొని, గర్భవతిని చేసిన ఘటనలో పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఉంటూ ఇంటర్ సెంకండియర్ చదువుతోంది. గతేడాది వేసవి సెలవుల నిమిత్తం ఇంటింకి వెళ్లిన బాలికకు మండలానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆ యువకుడు బాలికను శారీరకంగా లోబర్చుకున్నాడు. పలుమార్లు లైంగికదాడి చేయడంతో బాలిక గర్భం దాల్చింది. కడుపులోనొప్పితో బాధ పడుతుండగా కుటుంబీకులు బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలిక ఏడో నెల గర్భవతి అని డాక్టర్లు తెలపడంతో అవాక్కయ్యారు. సదురు యువకుడిని ప్రశ్నించి, బాలికను వివాహం చేసుకోవాలని కోరగా అతడు నిరాకరించాడు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ లక్ష్మణ్ తెలిపారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ అర్హత పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంగ్లిష్, హిందీ, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి తెలిపారు.

దీక్షకు అనుమతి కోసం హైకోర్టుకు వెళతాం: గట్టు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు మద్దతుగా తలపెట్టిన దీక్షకు అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ) సభ్యుడు గట్టు రామచంద్రరావు తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగుల పక్షాన దీక్షను ఆపేది లేదన్నారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ క్రమంలో పోలీస్ శాఖను కూడా కలుస్తామన్నారు. ఈ పోరాటంలో 'టీ–సేవ్'ద్వారా అన్ని వర్గాల వారిని కలుపుకుపోతామన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షకు పోలీసులు చివరి వరకు అనుమతి పెండింగ్‌లో పెట్టి తర్వాత లేదని చెప్పారన్నారు. వైఎస్ షర్మిలకు భయపడి తమ గళాన్ని నొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఆఫీస్‌కి రావడానికి కూడా అనుమతి అంటున్నారన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారనేది ఆయన ఇష్టమని గట్టు రామచంద్రరావు అన్నారు. ఆయన వైఎస్సార్‌టీపీలోకి రావాలనుకుంటే గేట్లు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

మే 6 వరకు టీఎస్ఐసెట్ దరఖాస్తుకు గడువు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుము లేకుండా మే 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఐసెట్‌ను మే 26, 27 తేదీల్లో నాలుగు సెషన్‌లలో నిర్వహించనున్నారు.

లీకేజీ ఎలా చేశారు? పేపర్లు ఎవరెవరికి అమ్మారు?

టీఎస్‌పీఎస్సీ కేసులో ఈడీ ప్రశ్నల వర్షం

- ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ఐదుగంటలకు పైగా ప్రశ్నించిన ఈడీ అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసిన నలుగురు అధికారుల బృందం
- నేడు మరోమారు ఇద్దరినీ ప్రశ్నించనున్న ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఈడీ దూకుడు పెంచింది. పేపర్ లీకేజీ నిందితులు, పేపర్లు కొనుగోలు చేసిన వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల మూలాలపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే సిట్ కేసు వివరాల ఆధారంగా ఈసీఐఆర్(ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ ముమ్మరం చేశారు. కేసులో ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్ , రాజశేఖర్‌రెడ్డిలను కోర్టు అనుమతితో సోమవారం నలుగురు సభ్యుల ఈడీ అధికారుల బృందం ప్రశ్నించింది. సోమవారం ఉదయం 11–45 గంటల సమయంలో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుమిత్ గోయల్, దేవేందర్‌సింగ్‌ల నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం చంచల్‌గూడ జైలుకు చేరుకుంది.

జైలు లోపలే వేర్వేరుగా విచారణ

జైలు లోపలే ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను వేర్వేరుగా ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ దర్యాప్తులో ఇద్దరి తరఫు న్యాయవాదుల సమక్షంలోనే ఈడీ అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. తొలి రోజు విచారణలో ప్రధానంగా ఇద్దరి కుటుంబ నేపథ్యాలు. బ్యాంకు లావాదేవీలు, టీఎస్‌పీఎస్సీలో ఇతర అధికారులు, సిబ్బందితో పరిచయాలు, పేపర్ లీకేజీకి ఎలా పాల్పడ్డారు..అనంతరం ఎవరెవరితో పేపర్ విక్రయానికి సంబంధించి సంప్రదింపులు జరిపారు..అన్న అంశాలపై లోతుగా ఆరా తీసినట్టు తెలిసింది.

మధ్యవర్తులుగా ఎవరెవరున్నారు?

టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నుంచి దొంగిలించిన పేపర్లు కొనుగోలుకు మధ్యవర్తులుగా ఎవరెవరు ఉన్నారు? వారితో ఎలా పరిచయం...? పేపర్ల కొనుగోలు చేసేందుకు ఎవరెవరు ఎలా సంప్రదించారన్న ప్రాథమిక అంశాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి ఈ కేసులో ఆర్థిక అంశాలపైనే ఈడీ ఫోకస్ పెట్టినప్పటికీ, అందుకు ఎలా మార్గాలు ఏర్పడ్డాయన్నది సైతం ఈడీ అధికారులు కూలంకషంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈడీ అధికారులు టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరమ్మ, మరో అధికారి సత్యనారాయణలను సైతం ఈ నెల 13న ప్రశ్నించిన విషయం తెలిసిందే. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. మంగళవారం మరోమారు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ప్రేమ పేరుతో మైనర్‌ను వేధిస్తున్నాడనే..

- నల్లగొండ జిల్లాలో యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది నిందితుల అరెస్ట్.. వారిలో ఇద్దరు మైనర్లు

నల్లగొండ క్రైం: ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న కారణంతోనే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్ అనే యువకుడిని బాలిక సోదరుడు తన బంధుమిత్రులతో కలసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్యలో పాల్గొన్న మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితులను సోమవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు కేసు వివరాలను వెల్లడించారు.

మందలించినా వినకపోవడంతో

త్రిపురారం మండలం అన్నారం గ్రామానికి చెందిన నవీన్ చదువు మధ్యలోనే ఆపేసి మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తన గ్రామానికే చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక సోదరుడు మణిదీప్ నవీన్‌ను మందలించాడు. బాలిక కూడా తనను మర్చిపోవాలని చెప్పడంతో మనస్తాపం చెంది మార్చి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆస్పత్రిలో కోలుకున్నాక మళ్లీ బాలిక ఇంటి చుట్టూ తిరుగడం మొదలుపెట్టాడు. దీంతో బాలిక సోదరుడు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లు కలిసి ఇంటి వైపు వస్తే చంపుతామని బెదిరించారు. ఆ విషయాన్ని నవీన్ నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన తన స్నేహితుడు ఈట అనిల్‌కుమార్‌కు చెప్పి సాయం కోరాడు. దీంతో ఈ నెల 9న అనిల్ మధ్యవర్తిగా మాట్లాడేందుకు గుంటిపల్లి గ్రామంలోని స్నేహితుడైన తిరుమల్ ఇంటి వద్దకు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లను పిలిచాడు. ఇదే అదునుగా నవీన్‌ను చంపాలనుకున్న మణిదీప్‌తో పాటు మరో 8 మంది బంధువులు మూడు బైకులపై తిరుమల్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేయగా ముగ్గురూ పారిపోయారు. 9 మందిలో ఒకరైన రామలింగం వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌ను 11 సార్లు పొడవగా అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు తొలుత గుంటూరుకు పారిపోయారు. అయితే చేతిలో డబ్బుల్లేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మృతుడు ఎస్సీ కావడంతో ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పంచాయతీలకు అవార్డుల పంట

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, అధికారులు అందుకున్నారు.

4 కేటగిరీల్లో నాలుగు మొదటి ర్యాంకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ విభాగంలో నాలుగు కేటగిరీల్లో నాలుగు గ్రామాలు మొదటి ర్యాంకులు సాధించగా, రెండు గ్రామాలు రెండో ర్యాంకులను, మరో రెండు గ్రామాలు మూడో ర్యాంకులను సాధించాయి. ఐదు నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలను తెలంగాణ కైవసం చేసుకుంది. అవార్డుల కార్యక్రమం అనంతరం మంత్రి ఎర్రబెల్లి తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వల్ల జరుగుతున్న పల్లెప్రగతి కార్యక్రమం, అది సాధించిన ఫలితాలను వివరించారు. దేశంలో తెలంగాణ మాత్రమే కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు సక్రమంగా అందజేస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనా పథంలో పనిచేస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలపాలని అవార్డు గ్రహీతలకు సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని మంత్రి ఎర్రబెల్లి కోరారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ :

1) **ఆరోగ్యకర పంచాయతీ:** గౌతంపూర్– 1వ ర్యాంకు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
2) **నీరు సమృద్ధిగా ఉన్న పంచాయతీ:** నెల్లుట్ల– 1వ ర్యాంకు(జనగాం జిల్లా)
3) **సామాజిక భద్రత పంచాయతీ:** కొంగట్‌పల్లి– 1వ ర్యాంకు (మహబూబ్‌నగర్ జిల్లా)
4) **మహిళలకు స్నేహపూర్వక పంచాయతీ:** అయిపూర్–1 వ ర్యాంకు (సూర్యాపేట జిల్లా)
5) **పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ:** మన్‌దొడ్డి– 2వ ర్యాంక్ (జోగుళాంబ గద్వాల్ జిల్లా)
6) **సుపరిపాలన పంచాయతీ:** చీమలదారి– 2వ ర్యాంక్ (వికారాబాద్ జిల్లా)
7) **పరిశుభ్ర పంచాయతీ :** సుల్తాన్‌పూర్–3వ ర్యాంకు (పెద్దపల్లి జిల్లా)
8) **స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీ:** గంభీరావ్‌పేట– 3వ ర్యాంకు (రాజన్న సిరిసిల్ల జిల్లా)

నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం...

బెస్ట్ బ్లాక్ పంచాయతీ: తిమ్మాపూర్(ఎల్ఎండీ)– 2వ ర్యాంకు (కరీంనగర్ జిల్లా)
బెస్ట్ డిస్ట్రిక్ట్ పంచాయతీ: ములుగు– 2వ ర్యాంకు
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ముక్రా– 3వ ర్యాంకు (ఆదిలాబాద్ జిల్లా)
కార్బన్ న్యూట్రల్ ప్రత్యేక పంచాయతీ అవార్డు: కన్హా– 2వ ర్యాంకు (రంగారెడ్డి జిల్లా)
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ఎర్రవెల్లికి ప్రత్యేక ప్రశంస (సిద్దిపేట జిల్లా)

తెలంగాణ స్ఫూర్తితో దేశమంతటా పల్లెల అభివృద్ధి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: పచ్చదనం, పరిశుభ్రత, ఇతర విభాగాల్లో తెలంగాణ పంచాయతీలు దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ప్రతి అంశంలోనూ అగ్రగామిగా నిలిచి, అత్యధిక అవార్డులు గెలుచుకున్న స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పల్లెల అభివృద్ధికి తమ కృషి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లితో పాటు అవార్డులు అందుకున్న ప్రజాప్రతినిధులను, అధికారులను సీఎం అభినందించారు. 'దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీలు పోటీపడితే 46 గ్రామాలు అవార్డులు దక్కించుకున్నాయి. వాటిలో 13 అవార్డులు తెలంగాణకే వచ్చినయి. అంటే ప్రకటించిన మొత్తం జాతీయ అవార్డుల్లో 30% తెలంగాణ కైవసం చేసుకున్నది. ఈ 13 ర్యాంకుల్లోనూ 4 ఫస్టు ర్యాంకులు తెలంగాణకే రావడం గొప్ప విషయం' అని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

450 కొనుగోలు కేంద్రాలే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరికోతలు మొదలై 20 రోజులు దాటినప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విషయంలో తాత్సారం కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 450 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ , కరీంనగర్ వంటి కొన్ని జిల్లాల్లోనే ఈ సెంటర్లను ప్రారంభించారు. ఖమ్మం, పెద్దపల్లి తదితర జిల్లాల్లో చాలా చోట్ల సెంటర్ల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే కోతలు పెరిగి ధాన్యం పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకొచ్చే పరిస్థితి ఉన్న చోటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం: గంగుల కమలాకర్ , పౌరసరఫరాల శాఖ మంత్రి

రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని పెద్ద గ్రామాల్లో రెండేసి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం. రైతులు తమ గ్రామ పరిధిలోని కొనుగోలు కేంద్రానికే వెళ్లి పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే సెంటర్ల నిర్వాహకుల పని. మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. తరుగు, తేమ, నాణ్యత పేరుతో మిల్లర్లు రైతులను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

స్ట్రాంగ్‌రూమ్ తాళంచెవుల మాయంపై ఆరా

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓ స్ట్రాంగ్ రూమ్ తాళం చెవుల మాయంపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు విచారణ చేపట్టారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఎన్నికల సామగ్రిని ఎలా భద్రపర్చారు.. తాళంచెవులు ఎలా తప్పిపోయాయి.. అనే దానిపైనే సుదీర్ఘంగా విచారణ జరిపినట్లు తెలిసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించడంతో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీ ఫుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 11న తమకు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే, మొత్తం మూడు స్ట్రాంగ్‌రూమ్‌లకుగాను రెండు తెరుచుకున్నాయి. కోర్టు అడిగిన 17ఏ, 17సీ వీడియో ఫుటేజీలు భద్రపర్చిన మూడోగది తాళంచెవులు లేవు. ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 12న మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాళంచెవులు మాయం కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించింది.

జిల్లా వార్తలు

క్రీడలతో మానసిక ఉల్లాసం


ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులు, నిర్వాహకులతో సీఐ వసంతకుమార్

జూలూరుపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ అన్నారు. జేఎస్‌టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యాన జూలూరుపాడులో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకుల్లో ఐకమత్యాన్ని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న జేఎస్‌టీయూహెచ్ జేఏసీని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల యువతలో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. జేఎస్‌టీయూహెచ్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మందా రంజిత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సందీప్‌తో పాటు జి.సురేష్ యాదవ్, పి.రమేష్, సునీల్‌కుమార్, రమేష్, మోదుగు రామకృష్ణ, పడిగల రవి, దినేష్, సాయి వంశీ, నరేష్, రవి, మౌళి, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఈనెల 12న గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాల పాలై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న వారిని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, రాష్ట్ర ఇన్‌కంటాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ సోమవారం పరామర్శించారు. తవసిబోడుకు చెందిన తేజావత్ భాస్కర్, వెంకటియా తండాకు చెందిన ఆంగోతు కుమార్‌ను పరామర్శించిన వారు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప, వైద్యులను కోరారు.

ఖమ్మం-కురవి హైవే అభివృద్ధికి నిధులు

- రూ.124.80 కోట్లు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం
- పెద్దతండా – పల్లెగూడెం వరకు నాలుగు లేన్లుగా రహదారి
- వెల్లడించిన బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం – కురవి జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 365 ఏ) అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జాతీయ రహదారిలో పలు చోట్ల నాలుగు లేన్లు వెడల్పు, అభివృద్ధి, డివైడర్ల, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం కేంద్రం రూ.124.80 కోట్లు విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈవిషయాన్ని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం వెల్లడించారు. కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై, లేఖలు అందించిన నేపథ్యాన కేంద్రం జాతీయ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రహదారి పనులపై చర్చిస్తున్న ఎంపీ నామా (ఫైల్)

రెండు ప్యాకేజీల్లో పనులు

ఖమ్మం–కురవి జాతీయ రహదారిలో పెద్ద తండా జంక్షన్ నుంచి పల్లెగూడెం వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరించడంతో పాటు డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే పల్లెగూడెం నుంచి ఎం.వెంకటాయపాలెం వరకు రోడ్డు విస్తరణ, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నారని ఎంపీ నామా పేర్కొన్నారు. మొదటి ప్యాకేజీ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.57.52 కోట్లకు పరిపాలనాపరమైన అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. ఇదే జాతీయ రహదారికి సంబంధించి మరో రెండు చోట్ల పనులకు కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పారు. రెండో ప్యాకేజీలో వెంకటగిరి క్రాస్ నుంచి కోదాడ క్రాస్ వరకు, ఏదులాపురం జంక్షన్ నుంచి పెద్ద తండా జంక్షన్ వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడమే కాక డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.67.28 కోట్లు మంజూరయ్యాయని ఎంపీ వివరించారు.

కేంద్రమంత్రితో పలుమార్లు భేటీ

జాతీయ రహదారి వెంట గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం తాను పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశమై లేఖలు ఇచ్చానని ఎంపీ నామా తెలిపారు. దీంతో నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో పనులు పూర్తయితే రహదారి వెంట గ్రామాలు, ప్రాంతాలు అభివృద్ధిని సాధిస్తాయని వివరించారు. అంతేకాక రవాణాపరంగా ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు.

ఉద్యోగ దరఖాస్తులు దర్బార్‌లో ఇవ్వొద్దు

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగాల కోసం నిరుద్యోగులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలే తప్ప దర్బార్‌లో ఇవ్వొద్దని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. ఐటీడీఏలో సోమవారం ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్‌లో ఆయన డీడీ రమాదేవితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ గిరిజనులు జీవనోపాధి, ఇతర సమస్యలపై మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఉద్యోగాల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల ద్వారా నియామకాలు ఉంటాయని చెప్పారు. కాగా, అర్హులైన ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎస్ఓ సురేష్‌బాబు, డీఎస్ఓ ప్రభాకర్‌రావుతో పాటు అధికారులు మునీర్ పాషా, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీడీ, ఏపీఓ జనరల్

ఆర్టీసీలో లాజిస్టిక్ ఏజెంట్ల నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కమీషన్ పద్ధతిపై పలువురు ఏజెంట్లు లాజిస్టిక్ కౌంటర్లు నిర్వహిస్తుండగా, మరికొందరిని నియమించనున్నట్లు ఖమ్మం, వరంగల్ జిల్లాల బాధ్యులు ఎం.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రధాన కూడళ్లతోపాటు అన్ని మండల కేంద్రాల్లో కమీషన్ పద్ధతిపై లాజిస్టిక్ సర్వీస్‌ను ప్రైవేట్ ఏజెంట్లకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా వ్యాపారం ఉండి, కంప్యూటర్, టిమ్ మిషన్ కలిగిన వారు లాజిస్టిక్ సెంటర్ ఏర్పాటుచేయొచ్చని, పార్సిల్ బుకింగ్‌పై 12శాతం కమీషన్ లభిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం 91542 88582, 81254 58546 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉమ్మడి ఖమ్మంపై బీజేపీ ప్రత్యేక దృష్టి

మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని మాజీ ఎమ్మెల్సీ గరికపాటి మోహన్‌రావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలతో ఒక పార్లమెంట్ స్థానంలో పార్టీని బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో విజయం సాధించేలా దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. త్వరలోనే ఈ జిల్లాలో వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరనున్నారని తెలిపారు. ఈమేరకు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తున్నందున ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కోనేరు సత్యనారాయణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రమేష్, నున్న రవికుమార్, శ్యాం రాథోడ్, ఉప్పల శారద, వాసుదేవరావు, విజయరెడ్డి, దీకొండ శ్యాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

నిర్దిష్టమైన ప్రణాళికతోనే మెరుగైన ఫలితాలు

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్: అధికారులు నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించి సమష్టి కృషితో ముందుకు సాగితే లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధ్యమవుతుందని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన పీకే ఓసీ–2, పీకేఓసీ–4, కేపీయూజీ, మణుగూరు ఓపెన్‌కాస్టు గనులను సందర్శించారు. అక్కడ బొగ్గు ఉత్పత్తి, లోడింగ్‌ను పరిశీలించాక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 119.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి సమష్టి కృషితో కృషి చేయాలని సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయి వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓలు జి.నాగేశ్వరరావు, శ్రీనివాసాచారి, అధికారులు ఎం.నర్సిరెడ్డి, రాముడు, సురేష్, రాంబాబు, శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

రామాలయంలో అంతర్గత బదిలీలు

శాఖల మార్పుతో ప్రక్షాళనపై ఈఓ దృష్టి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేశారు. ఈ వివరాలను ఈఓ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏఈఓ–1 శ్రవణ్‌కుమార్‌కు భూములు, దుకాణాలు, అద్దె, రికార్డు గది, ప్రధాన ఉత్సవాలు, శ్రీరామదీక్ష, ప్రచార రథం, శాశ్వత అన్నదానం, శాశ్వత పూజలు, ట్రస్ట్‌బోర్డు, ఆడిట్ తదితర విభాగాలను అప్పగించారు. అలాగే, ఏఈఓ–2 భవానీ రామకృష్ణకు ఎస్టాబ్లిష్‌మెంట్, సీఆర్ఓ, కౌంటర్ల పరిశీలన, దేవస్థానం, వీఐపీల ప్రొటోకాల్, గోశాల, అన్నదానం, కల్యాణకట్ట, ప్రచార శాఖ, ప్రసాదం తయారీ, పర్ణశాల తదితర శాఖలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక సూపరింటెండెంట్ నిరంజన్‌కు ప్రొవిజన్ స్టోర్, ప్రసాదం తయారీ, అన్నదానం, కల్యాణకట్ట, సీఆర్ఓ, లడ్డూ కౌంటర్లు, స్టాక్, టికెట్ కౌంటర్ల పరిశీలన, మరో సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్‌కు ఎస్టాబ్లిస్‌మెంట్, వేతనాలు, భూములు, అద్దె, లైసెన్సు తదితర విభాగాలు, ఇంకో సూపరింటెండెంట్ లింగాల సాయిబాబుకు దేవస్థానం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూనే వీఐపీల ప్రొటోకాల్, పాత, కొత్త గోశాల, ప్రచార శాఖ పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించారు. మరో సూపరింటెండెంట్ కిషోర్‌కు ఆడిట్, రికార్డులు, శాశ్వత అన్నదానం, శాశ్వత పూజలతో పాటుగా శని, ఆదివారాలలో పర్ణశాల దేవస్థానంలో విధులు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, విధుల్లో చేరిన కొద్ది కాలంలో ఈఓ రమాదేవి పలువురు అధికారులు, ఉద్యోగుల శాఖల మార్పు చేయడం ద్వారా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లయింది.



రామాలయం వ్యూ

తనిఖీలకు కమిటీలు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలోని వివిధ విభాగాల స్టోర్స్‌ల్లో తనిఖీ చేసేందుకు కమిటీలు ఏర్పాటుచేసినట్లు ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించిన స్టాక్, రిజిస్టర్లను ఆయా కమిటీలు తనిఖీ చేస్తూ అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కాగా, కమిటీల పనితీరుపై సీసీ ఎం.అనిల్‌కుమార్ పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని ఈఓ ఆదేశించారు

24నుంచి కేయూ ఐదేళ్ల లా సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల లా కోర్సు మొదటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ వివరాలను నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం తెలిపారు. ఐదేళ్ల లా కోర్సు తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24, 27, మే 1, 4, 8వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. అలాగే, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 29, మే 2వ తేదీల్లో, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, మే 1, 3వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, మే 3, 6, 10వ తేదీల్లో, ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, మే 2, 5, 9వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు.